సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 13 । మే । 2023



గ్యాస్ దొరకక.. పూట గడవక..

జిల్లాలో గ్యాస్‌తో నడిచే ఆటోలకు సరిపడా ఫిల్లింగ్ స్టేషన్లు లేక ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. IIలో



రండీ.. ఎదగండి!

పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఉన్న అవకాశాలను ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం కలెక్టర్ గౌతమ్ సూచించారు. IIలో

గరిష్టం / కనిష్టం
43° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం వైభవంగా సుదర్శన హోమం జరిపించారు. ఈ సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవ, అర్చన, గోత్రనామార్చనలు తదితర పూజలు చేశారు. అనంతరం అర్చకుడు గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయంలో ప్రతీ నెల ఈ హోమం చేస్తున్నామని మేనేజర్ రమణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వనమా గాంధీ దంపతులు, వనమా వెంకటేష్ దంపతులు, ఆలయ మజీ ధర్మకర్త ఉపేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం చేశారు. ముందుగా అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం చేసిన అర్చకులు.. ఆ తర్వాత పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి, చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు కిలారు నాగమల్లేశ్వరరావు, చింతా నాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

'నవోదయ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023 – 24 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 – 23 సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల్లో చదివి పదో తరగతి ఉత్తీర్ణులైన భద్రాద్రి జిల్లా విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 31 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 22న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 08742 – 273025 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అధికారులకు ఉత్తమ సేవా పతకాలు



ఆరో బెటాలియన్ అధికారికి పతకం అందజేస్తున్న హోంమంత్రి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఆరో బెటాలియన్‌లో పని చేస్తున్న కొందరు ఉన్నతాధికారులు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో హోం మంత్రి మహమూద్ అలీ పతకాలను ప్రదానం చేశారు. చాతకొండ బెటాలియన్ అడిషనల్ కమాండర్ ఎస్.శ్రీనివాస్‌రావు, ఆర్ఎస్సై శ్రీనివాస్, ఎస్కే మహమూద్ పతకాలు అందుకోగా, బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ శుక్రవారం వారిని అభినందించారు.

ఎస్పీని కలిసిన చిత్ర బృందం

కొత్తగూడెంటౌన్: నూతన నటీనటులతో నిర్మించిన గండికోట రహస్యం సినిమా మొదటి ఆటను ప్రారంభించేందుకు అతిథిగా రావాలని చిత్ర బృందం సభ్యులు ఎస్పీ డాక్టర్ వినీత్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ చాంబర్‌లో చిత్ర నిర్మాత సాధనాల రాజమణి, కథానాయకుడు సత్య తదితరులు కలిసి సినిమా విశేషాలను తెలియజేశారు. ఈనెల 15న పాల్వంచలోని శాంతి థియేటర్‌లో సినిమా మొదటి ఆట ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీపాద సత్యనారాయణ, షేక్ మీరాహుస్సేన్, షేక్ దస్తగిరి పాల్గొన్నారు.

ఆరంభ శూరత్వమే !

ఇల్లెందు నియోజకవర్గంలో ఎక్కడి పనులు అక్కడే

- మూడు జిల్లాలతో ముడిపడిన సెగ్మెంట్
- ఫోకస్ చేస్తేనే ఇక్కడ అభివృద్ధి జరిగేది
- మధ్యలో నిలిచిపోయిన అనేక పనులు
- పదవీ కాలం ఆఖరున తడబడుతున్న ఎమ్మెల్యే



నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిన మల్టీ యుటిలిటీ సెంటర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు నియోజకవర్గం దశాబ్దాల పాటు గుణాత్మక అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత క్రమంగా ఇక్కడ మార్పు మొదలైంది. జిల్లాల విభజన తర్వాత ఇల్లెందు, టేకులపల్లి మండలాలు భద్రాద్రి జిల్లా, కామేపల్లి ఖమ్మం జిల్లా, గార్ల, బయ్యారం మండలాలు మహబూబాబాద్ జిల్లాల పరిధిలోకి వెళ్లాయి. దీంతో ఇల్లెందును అభివృద్ధి పథంలో నిలపాలంటే మూడు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఉండాలి. ప్రస్తుతం ఇక్కడి ఎమ్మెల్యే హరిప్రియానాయక్‌పై ఈ బాధ్యత మరింతగా ఉంది. ఎమ్మెల్యేగా గెలిచిన తొలినాళ్లలో అభివృద్ధి విషయంలో జెట్ స్పీడ్ చూపించిన హరిప్రియ ఆ తర్వాత అదే వేగం కనబరచడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో మధ్యలోనే ఆగిపోయిన అనేక పనులు అందుకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

'సీతారామ'పై స్పష్టత కరువు

బహుళార్థ సాధక ప్రాజెక్టుగా చెబుతున్న సీతారామ నిర్మాణ పనులకు ఇల్లెందు నియోజకర్గంలోనే సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు పైగా సాగు నీరు అందే వీలుండేది. అయితే ఈ ప్రాజెక్టు డిజైన్‌ను మార్చడంతో ప్రస్తుతం ఈ నియోజకవర్గం మొత్తం సీతారామ ప్రాజెక్టు లబ్దిదారుల జాబితా నుంచి తొలగించబడింది. గోదావరి జలాలను నియోజకర్గప్రజలకు అందుబాటులోకి తెస్తామంటూ ఎమ్మెల్యే పలుమార్లు హామీ ఇచ్చినా ఇంత వరకు స్పష్టమైన కార్యాచరణ కరువైంది. ఇల్లెందుకు గోదావరి జలాలు తెచ్చేలా కొత్త డీపీఆర్ సిద్ధమైందనే మాటలు ప్రకటనలకే పరిమితం అయ్యాయి.

పరిశ్రమల జాడే లేదు

నియోజకవర్గ వ్యాప్తంగా సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయి. అయితే అందుకు తగ్గట్టుగా పారిశ్రామికీకరణ జరగలేదు. సింగరేణి విషయానికే వస్తే జేకే ఓసీ విస్తరణ పనులే ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టు సాగుతున్నాయి. బయ్యారం ఉక్కు, పెల్లెట్ పరిశ్రమల జాడే లేదు. నియోజకవర్గంలో విస్తారంగా ఉన్న పెంకు ఫ్యాక్టరీ ఆధునికీకరణకు ఎలాంటి కార్యాచరణ కనిపించడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా కొత్త రోడ్లకు కోట్ల రూపాయలు మంజూరైనా ఓ వైపు అనుమతులు రాక, మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో పనులు పూర్తి కాలేదు. కొన్ని మొదలే కాలేదు. అయినా వీటిపై ఎమ్మెల్యే దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ద్వారా రూ.5 కోట్ల పనులదీ ఇదే పరిస్థితి. ఓసీ ప్రభావిత ప్రాంతమైన 21 ఓల్డ్ క్వార్టర్స్ ఏరియా వాసులకు ఇండస్ట్రియల్ కరెంట్ స్థానంలో విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తామని చెప్పిన హామీ మాటలకే పరిమితమైంది.

పనుల్లో తాత్సారం

తెలంగాణ వచ్చాక నియోజకర్గ కేంద్రమైన ఇల్లెందు పట్టణంలో అనేక అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. శంకుస్థాపనలు, నిర్మాణ పనులు చకచక మొదలయ్యాయి. కానీ చివరకు 90 శాతం మేర పనులు ఇంకా పూర్తి కాలేదు. ఆయా భవనాలు ప్రజలకు వినియోగంలోకి రాలేదు. నిధుల లేమితో మధ్యలో ఆగిపోవడం, నిర్మాణం పూర్తయిన వాటిని ప్రారంభించడంలో తాత్సారం జరుగుతోంది. ఇక వేసవి సెలవులు, మంచి ముహూర్తాలతో ప్రయాణాలు పెరిగినా డిపో ప్రారంభించకపోవడంతో ఇక్కడి ప్రజలకు కీలక సమయంలో అక్కరకు రాకుండా పోయింది. వేసవిలో ప్రజలకు అహ్లాదాన్ని పంచాల్సిన పార్కు లేక్ పార్క్, ట్యాంక్‌బండ్ నిర్మాణం పూర్తయినా మూసే ఉంచారు.

చేపట్టిన పనుల పురోగతి, కేటాయింపులు ఇలా..

పని	బడ్జెట్ (రూ.కోట్లలో)	ప్రస్తుత దశ
మల్టీ యుటిలిటీ సెంటర్	1.30	మధ్యలో ఆగిపోయింది
స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్	1.50	నిధులు లేక నిలిచిపోయింది
మినీ స్టేడియం	3.0	నిధులు లేక నిలిచిపోయింది
వెజ్ నాన్ వెజ్ మార్కెట్	8.0	నత్తనడక నిర్మాణం
మోడ్రన్ మార్కెట్	3.0	పునాదుల దశలో
ఇల్లెందు చెరువు ఫెన్సింగ్	0.41	తుదిదశలో నిర్మాణ పనులు
లేక్ పార్క్	1.70	తుదిదశలో నిర్మాణ పనులు
ట్యాంక్‌బండ్ సుందరీకరణ	1.70	తుదిదశలో నిర్మాణ పనులు
బంజారా భవన్	1.0	పునాదుల దశలో
అంబేడ్కర్ భవన్	1.15	పునాదుల దశలోనే
మున్సిపల్ గెస్ట్ హౌస్	0.60	పనులు ప్రారంభం కాలేదు
శ్మశాన వాటిక	2.10	నిర్మాణం తుదిదశలో
ఎఫ్ఎస్‌టీపీ సెంటర్	0.58	ప్రారంభోత్సవం కాలేదు
షాపింగ్ కాంప్లెక్స్	1.50	ప్రారంభోత్సవం కాలేదు
బస్ డిపో	3.75	ప్రారంభోత్సవం కాలేదు



నత్తనడకన పనులు సాగుతున్న వెజ్, నాన్ వెజ్ మార్కెట్

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

పట్టణ ప్రగతి సమీక్షలో కలెక్టర్ అనుదీప్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగని వార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అనుదీప్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో శుక్రవారం ఆయన మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, పట్టణ ప్రగతి ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్యక్రమాలకు యంత్రాలను వినియోగించాలన్నారు. పనుల నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, స్వచ్ఛ వాహనం ప్రతి ఇంటికి వెళుతోందా లేదా పర్యవేక్షించాలన్నారు. స్వచ్ఛ వాహనాల జీపీఎస్ నమోదు ప్రక్రియ నివేదికలు సక్రమంగా ఇవ్వడం లేదంటూ మణుగూరు మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించకుంటే ఆ వ్యర్థాలను మురుగు కాల్వల్లో, బహిరంగ ప్రదేశాలలో వేస్తారని అన్నారు. సమీకృత మార్కెట్ల నిర్మాణాలు జూలై నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ప్రత్యేక అధికారులు అర్జున్, అలీం, మున్సిపల్ కమిషనర్లు అంకుషావలీ, శ్రీకాంత్, ఉమా మహేశ్వరరావు, డీఈలు నవీన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో వెలుగులు నింపాలి

గ్రామీణుల ఆర్థిక స్వావలంబనకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు ప్రధానమని కలెక్టర్ అనుదీప్ అన్నారు. గ్రామ సమాఖ్యలకు రుణాల మంజూరు, బ్యాంకు లింకేజీ, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, రుణాల రికవరీ తదితర అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి అనే ఆయుధంతో గ్రామీణ ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని అన్నారు. యూనిట్ల ఏర్పాటుకు సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులకు తక్కువ ధరలకు వ్యవసాయ పనిముట్లు అద్దెకు ఇచ్చేందుకు ములకలపల్లి, టేకులపల్లి, పినపాక, మణుగూరులో కస్టం హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 18,160 మహిళా స్వయం సహాయక సంఘాలున్నాయని, వాటిలో 8,536 గ్రూపుల గ్రేడింగ్ ప్రక్రియ వారం రోజుల్లో ఆన్‌లైన్ చేయాలని ఏపీఎం, సీసీలను ఆదేశించారు. గతేడాది బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.621 కోట్ల రుణాల మంజూరు లక్ష్యం కాగా 8,133 సంఘాలకు రూ.452 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం 10,527 సంఘాలకు రూ. 381 కోట్ల రుణాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ. 56 కోట్లు మంజూరు చేసిట్లు తెలిపారు. డీఆర్డీఓ మధుసూదన్ రాజు, ఏడీఆర్డీఓ నీలేష్, స్త్రీనిధి ఆర్ఎం సంపత్, డీపీఎం రంగారావు, బ్యాంక్ లింకేజీ డీపీఎం రమాకాంత్, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీపై విచారణ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా మైనార్టీ గురుకుల కళాశాలల్లో ఉద్యోగాల పేరుతో రూ.లక్షలు దండుకుంటున్నట్లు ఓ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై కొందరు మైనార్టీ గురుకుల సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. దీంతో సందరు ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టి, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మైనార్టీ గురుకుల సెక్రటరీ కార్యాలయం నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు జిల్లా అధికారులకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ, ఆ ఆదేశాల అమలును జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో నిరుద్యోగులు నష్టపోయే ప్రమాదం ఉందనే విమర్శలు వస్తున్నాయి. సదరు ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టకుండా కాపాడుతూ, వెనుకాల ఉండి నడిపిస్తున్నది జిల్లా అధికారులేననే ఆరోపణలు వస్తున్నాయి. ఫిర్యాదుదారులను సైతం బెది రింపులకు గురిచేస్తూ ఉద్యోగాలు తీసివేస్తామని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. అయితే, సదరు ఏజెన్సీ నిర్వాహకుడు, జిల్లా కలెక్టరేట్‌లో పైరవీలు చేస్తూ రూ.లక్షల ముడుపులు ఇస్తుండటంతో విచారణ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఏజెన్సీపై విజిలెన్స్ విచారణ నివేదిక ఇచ్చి నెల గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరు ఏజెన్సీపై తిరిగి విచారణ చేయడం కోసం డీసీఓ వెంకటేశ్వర్లను అధికారిగా శుక్రవారం నియమించారు. దీనిపై డీసీఓ వెంకటేశ్వర్లను వివరణ కోరగా పర్‌ఫెక్ట్ ఏజెన్సీపై విచారణ జరుగుతోందని, ఫిర్యాదుదారులు 9 మందికిగాను 8 మంది విచారణకు హాజరయ్యారని తెలిపారు.

ఖమ్మం కలెక్టరేట్‌లో నెమలి!



కలెక్టరేట్ ఆవరణలో నెమలి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలో నెమళ్లు తిరుగుతున్నాయి. గతంలో ఇక్కడ పొలాలు, వెనుక భాగాన అటవీ ప్రాంతం ఉండడంతో నెమళ్లు తిరిగేవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు కలెక్టరేట్ నిర్మించినా పెద్దసంఖ్యలో మొక్కలు నాటగా వనంలా ఉండడంతో ఆవరణ, భవనంపై నెమళ్లు తిరుగుతుండగా ఉద్యోగులు తీసిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

స్వర్ణకవచాలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధ న తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావా చనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు హనుమజ్జయంతి

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాలయంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామికి ఉదయం 5.30 గంటలకు అభిషేకం, 8 గంటలకు తమలపాకు పూజ, సాయంత్రం రామయ్యతో కలిసి ఆంజనేయుడికి తిరువీధి సేవ, ప్రసాద నివేదన, ఆలయంలో సుందరకాండ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు, హనుమాన్ మాలధారుల కోసం పడమర గోపురం ఉచిత క్యూలైన్ వద్ద, తూర్పు మెట్ల వద్ద పూర్వపు లడ్డూ ప్రసాద కౌంటర్లు పనిచేస్తాయని వెల్లడించారు. భక్తులకు తాగునీరు, ఉచిత మజ్జిగ పంపిణీ, అన్నదానం ఉంటాయని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన డీడబ్ల్యూఓ సబిత



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు మొక్క అంజేస్తున్న సబిత

కొత్తగూడెంటౌన్: జిల్లా సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూఓ)గా ఎం.సబిత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హన్మకొండలో పని చేస్తున్న సబితను జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓగా కొనసాగిన స్వర్ణలత లెనీనా తిరిగి ఐసీడీఎస్‌లో సీడీపీఓ విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సబిత కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు.

నిబంధనలు పాటించకుంటే అనుమతి రద్దు

- డీఎంహెచ్‌ఓ శిరీష హెచ్చరిక
- ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లలో తనిఖీ
- ఎనిమిది ఆస్పత్రులు సీజ్, మరో 21 ఆస్పత్రులకు నోటీసులు



స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష తదితరులు



ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని 43 ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లను శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీ చేశారు. దాదాపు 30 మంది అధికారులు ఏడు బృందాలుగా విడిపోయి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష మాట్లాడుతూ.. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి నిర్వాహకులను హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న 8 ఆస్పత్రులను సీజ్ చేశామని, మరో 21 ఆస్పత్రుల్లో రోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు, నిబంధనలు సరిగా లేవని గుర్తించి మొదటి హెచ్చరికగా నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఇదే విధంగా వ్యవహరిస్తే ఆస్పత్రుల అనుమతి రద్దు చేస్తామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్, డయాగ్నొస్టిక్ సెంటర్ల యజమానులు తప్పనిసరిగా వైద్యారోగ్య శాఖ నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ చైతన్య, డాక్టర్ హర్షనాయక్, డిప్యూటీ డెమోలు ఫయిజ్ మొయిద్దీన్, నాగలక్ష్మి, సీహెచ్‌ఓలు నాగభూషణం, రామకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు విజయ్‌కుమార్, బేబీ, రమణారెడ్డి, సబ్ యూనిట్ అధికారి గొంది వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ హరికృష్ణ, డీఎస్ఓ ఇస్నోక్, రాంబాబు, కవిత, రాకేష్, ధనుజ, శ్రీకాంత్, శ్రీధర్, యాకూబ్ బాబా, ఉమామహేశ్వరి అప్పన్న, ఇమామ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఎంసెట్



విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

సుజాతనగర్: ఇంజనీరింగ్, వైద్య, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే తెలంగాణ ఎంసెట్–2023 పరీక్షలు స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్నాయి. బుధ, గురువారాల్లో మెడికల్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలు జరగ్గా.. శుక్రవారం నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు మొదలయ్యాయి. ఉదయం జరిగిన పరీక్షకు 125 మంది హాజరు కావాల్సి ఉండగా 118 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు కూడా 125 మంది హాజరుకావాల్సి ఉండగా 120 మంది హాజరయ్యారు. రెండు సెషన్లలో 12 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

తుమ్మలకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న హరిప్రియ

ఇల్లెందు: బయ్యారంలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే హరిప్రియ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వచ్చారు. శుక్రవారం ఇల్లెందులో కరెంట్‌ఆఫీస్ సెంటర్ వద్ద భారీ కాన్వాయ్ ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా బయలుదేరారు. హరిసింగ్‌నాయక్, పులిగళ్ల మాధవరావు, పేరయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్, రేణుక, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

30వ సారి రక్తదానం చేసిన యువకుడు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి బ్లడ్ డొనేషన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి 30వ సారి రక్తదానం చేశారు. బూర్గంపాడు మండలం మర్రికుంట గ్రామానికి చెందిన బాలుడు మడకం రాము భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సికిల్‌సెల్ ఎనీమియాతో చికిత్స పొందుతున్నాడు. బాలుడికి రక్తం 2 గ్రాములే ఉండటంతో వెంటనే రక్తం ఎక్కించాలని సిబ్బంది సమాచారం ఇవ్వడంతో వేణుగోపాల్‌రెడ్డి రక్తదానం చేశారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

టేకులపల్లి: విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గురువారం ఈదురుగాలులు, భారీ వర్షం కారణంగా కోయగూడెంలోని పంట పొలాల్లో మోటార్‌కు విద్యుత్ సరఫరా చేసే వైర్లు తెగిపడ్డాయి. పెరుగునాగయ్య, దాసరి మల్లయ్యకు చెందిన రెండు గేదెలు శుక్రవారం మేతకు వెళ్లాయి. నేలపై పడిన విద్యుత్ తీగలను అవి తాకడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం – చినరాయిగూడెం మార్గమధ్యలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథం మేరకు.. చినరాయిగూడెం సమీపంలోని పెద్దవాగు బ్రిడ్జి కింద గుర్తు తెలియని మృతదేహం స్థానికులకు కనిపించింది. వెంటనే వారు ఈ సమాచారాన్ని పోలీసులకు అందించారు. మణుగూరు సీఐ ముత్యం రమేష్, ఎస్‌ఐ రాజ్‌కుమార్ సిబ్బందితో ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. విచారణలో మృతుడిని కంపెల రవీందర్‌గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

భద్రాచలం: భద్రాచలం పట్టణంలోని రిక్షాకాలనీకి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని రిక్షాకాలనీకి చెందిన భాస్కర్ (37) మద్యానికి బానిసగా మారి తరుచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేసరికి మృతి చెందాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బంగారు ఆభరణాలు చోరీ

పాల్వంచ: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లో చొరబడి బంగారు, వెండి ఆభరణాలు అపహరించిన ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఒడ్డుగూడెంనకు చెందిన బాలాజీ నాలుగు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. తలుపులు తెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.1.26 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు కనిపించలేదు. అవి చోరీకి గురైనట్లు భావించిన బాలాజీ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

గ్యాస్ దొరకక.. పూట గడవక..

- జిల్లాలో గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు కరువు
- ప్రస్తుతం పాల్వంచలో ఒక్కచోటనే
- ఇబ్బంది పడుతున్న గ్యాస్ ఆటోవాలాలు



గ్యాస్ నింపుకునేందుకు పాల్వంచ బంకు వద్ద ఆటోలు

సుజాతనగర్: జిల్లాలో సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) దొరకక ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీజిల్ ఆటోల కంటే సీఎన్‌జీ ఆటోలు ఎక్కువ మైలేజ్ ఇస్తుండటంతో వీటి వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. కాగా, గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడంతో పూట గడవడం కష్టంగా మారిందని వాపోతున్నారు.

జిల్లాలో 2 వేల ఆటోలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా సుమారు 1500 నుంచి 2 వేల వరకు సీఎన్‌జీ ఆటోలు ఉన్నాయి. డీజిల్ ఆటోల కంటే వీటి ధరలో కూడా సుమారు రూ.30 నుంచి రూ.50 వేల వరకు తగ్గుదల ఉంది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా చాలా మంది ఆటోడ్రైవర్లు సీఎన్‌జీ ఆటోలను కొనుగోలు చేశారు. గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు కూడా అందుబాటులోకి వస్తాయని, భద్రాచలం, కొత్తగూడెం పట్టణాలలో త్వరలో ప్రారంభమవుతాయని ఆయా షారూమ్‌లలో చెప్పడంతోనే ఆటోలను కొనుగోలు చేశామని పలువురు ఆటోడ్రైవర్లు చెబుతున్నారు.

మైలేజ్ దృష్ట్యా

డీజిల్ ఆటో ఒక లీటరుకు 30 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. సీఎన్‌జీ ఆటో ఒక కేజీ గ్యాస్‌తో సుమారు 45 కిలోమీటర్ల మైలేజ్‌ను ఇస్తుంది. లీటర్ డీజిల్ ధర రూ.98 వరకు ఉంది. కేజీ గ్యాస్ ధర రూ.92 వరకు ఉంది. గ్యాస్, డీజిల్ ధరల విషయంలో రెండింటికీ ఆరు రూపాయల మినహా పెద్దగా వ్యత్యాసం లేనప్పటికీ.. మైలేజ్ విషయంలో సీఎన్‌జీ ఆటో సుమారు 15 కి.మీ మేర అదనంగా ఇస్తుండంతో ఆ ఆటోలను కొనుగోలు చేస్తున్నారు. అయితే, ఆటోలకు అనుగుణంగా గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఆటోవాలాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రస్తుతం పాల్వంచలోనే..

జిల్లా వ్యాప్తంగా 72 పెట్రోల్ బంకులున్నప్పటికీ సీఎన్‌జీ ఫిల్లింగ్ సౌకర్యం మాత్రం కేవలం పాల్వంచలోని ఓ బంకులోనే ఉంది. కొత్తగూడెం, భద్రాచలం పట్టణాలలో రెండు చోట్ల ఈ సౌకర్యం ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా అక్కడ ప్రారంభించలేదు. దీంతో సీఎన్‌జీ సౌకర్యం కలిగిన పాల్వంచ బంకు వద్ద ఆటోవాలాలు గంటల తరబడి క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా అన్ని చోట్లా రవాణా సౌకర్యం అంతగా లేకపోవడంతో ఏదో ఒక పని కోసం నిత్యం ఆటోలను ఆశ్రయించడం సర్వ సాధారణమైంది. గ్యాస్ నింపుకునేందుకు గంటల తరబడి వేచి ఉంటున్నామని, దీంతో తమకు పూట గడవటం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కొత్తగూడెం, పాల్వంచలో సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సీఎన్‌జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడంతో దీని విషయంలో కేవలం ఆటోలే కాకుండా ఇతర వాహనదారులు సైతం ఇబ్బందులు పడక తప్పడం లేదు.

గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది



సీఎన్‌జీ గ్యాస్ నింపుకునేందుకు చర్ల నుంచి వచ్చాను. నేను ఆటో కొనుగోలు చేసిన సమయంలో భద్రాచలంలో ప్రారంభిస్తారని చెప్పారు. ఇంత వరకు అక్కడ ప్రారంభించలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. **– పి.సత్తిబాబు, చర్ల**

కొత్తగూడెంలో ప్రారంభించాలి



సీఎన్‌జీ గ్యాస్ ప్రతి చోటా అందుబాటులో లేకపోవడంతో పాల్వంచవెళ్లి గ్యాస్ పెట్టించుకోవాల్సి వస్తోంది. దీంతో కిరాయిలు సరిగా రావడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే సీఎన్‌జీ ఆటోలు తగ్గిపోయి డీజిల్ వాహనాలు పెరుగుతాయి.**– ఎస్‌కే మాలిక్, ఇల్లెందు**

బ్రహ్మకుమారీల మధ్య వివాదం



పద్మజకు సంఘీభావం తెలుపుతున్న దిశ కమిటీ నాయకులు

పాల్వంచ: పట్టణంలోని ప్రజాహిత బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వహణ వివాదాస్పదంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న బ్రాంచ్ నిర్వాహకురాలు పద్మజ, సిబ్బందితో కలిసి ఈ నెల 6వ తేదీన మహారాష్ట్రలోని నాసిక్ జ్యోతి త్రయంబకేశ్వరం వెళ్లారు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన బ్రహ్మకుమారీస్ సబిత, శ్రీలత ఆధ్వర్యంలో స్థానికంగా ఉండే కొందరు పాల్వంచలోని బ్రాంచ్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. సమాచారం అందుకున్న పద్మజ మహారాష్ట్ర నుంచి శుక్రవారం పాల్వంచ చేరుకున్నారు. కాగా, లోపలికి వెళ్లేందుకు యత్నించగా వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ.. తాను లేని సమయంలో తన బ్రాంచ్‌లోకి ఎలాంటి అనుమతి లేకుండా ప్రవేశించారని, ఇదేమని అడిగితే తనను తొలగించారంటు చెప్పారని, కానీ ఈ విషయం తన దృష్టికి తీసుకురాలేదన్నారు. 16 ఏళ్లుగా నడుస్తున్న సంస్థలోకి ప్రవేశించి తన నగదు, సామగ్రిని చోరీ చేశారని ఆరోపించారు. స్థానికంగా ఉన్న కొందరు కుట్ర పన్ని తాను చేస్తున్న ఆధ్యాత్మిక సేవను అడ్డుకుంటున్నారని, తానుచేస్తున్న సేవలకు ఇటీవల రెండు ఇంటర్నేషనల్ అవార్డులకు ఎంపికయ్యానని తెలిపారు. కాగా, దిశ కమిటీ మహిళలు పద్మజకు సంఘీభావం తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ప్రవీణ్ అక్కడికి చేరుకుని వారి ఇరువర్గాలకు సర్దిచెప్పారు. కార్యక్రమంలో దిశ కమిటీ అధ్యక్షులు అన్నపూర్ణతోపాటు సభ్యులు మాధవి, పద్మ, నాగమణి, జ్యోతి, నిర్మల, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మట్టి లారీల అడ్డగింత



మట్టి లారీలను అడ్డుకుంటున్న స్థానికులు

సుజాతనగర్: భద్రాచలం రోడ్ టూ సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత లేదని ఆరోపిస్తూ వేపలగడ్డ గ్రామస్తులు శుక్రవారం రాత్రి మట్టి లారీలను అడ్డుకున్నారు. రోడ్డు ఎత్తు పెంచేందుకు చెరువు మట్టి వాడుతుండటం, దుమ్ము ధూళితో ఇబ్బందిగా మారడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించే రోడ్డుకు చెరువు మట్టి ఉపయోగించడం సరికాదని, పది కాలాల పాటు ఉండాల్సిన రోడ్డుకు నాణ్యత లేని మట్టిని వాడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతతో పనులు నిర్వహించాలని, లేనిపక్షంలో పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ముగ్గురు మావోయిస్ట్ కొరియర్లు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: మావోయిస్టు దళాలకు అవసరమయ్యే పేలుడు పదార్థాలు, నిత్యావసరాలను సరఫరా చేస్తున్న ముగ్గురు మావోయిస్ట్ కొరియర్లను చర్ల పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఎస్పీ వినీత్ వివరాలు వెల్లడించారు. చర్లలోని లక్ష్మీకాలనీలో స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన చర్ల సాలిబజార్‌కు చెందిన గుర్రాల విజయ్, భీమవరపు సాయి, భీమవరపు ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు, నిత్యావసర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వీరు కొంతకాలంగా మావోయిస్టులకు కొరియర్లుగా పనిచేస్తున్నారని, మావోయిస్టు దళాలకు సాయం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. పేలుడు పదార్థాలు, నిత్యావసరాలను మావోయిస్టులకు చేరవేసేందుకే తీసుకెళ్తున్నట్లు వారు అంగీకరించారని ఆయన వెల్లడించారు. సమావేశంలో ఓఎస్డీ టి.సాయిమనోహర్, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌ధర్, అడిషనల్ కమాండెంట్ కమల్‌వీర్‌యాదవ్, చర్ల సీఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో నగదు చోరీ

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడి జేబులో నుంచి గుర్తు తెలియని దుండగులు నగదు అపహరించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. బూర్గంపాడుకు చెందిన ఎస్‌కే భోలే, ఎస్‌కే బాబా కలిసి ఏపీలోని జంగారెడ్డిగూడేనికి ఆటో కొనుగోలు చేసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే మార్గమధ్యలోని అశ్వారావుపేట బస్టాండ్‌లో భోజనం చేసి తిరిగి జంగారెడ్డిగూడేనికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో ఎస్‌కే భోలే పాయింట్ జేబులో ఉన్న రూ.45 వేల నగదును గుర్తు తెలియని దుండగులు కాజేశారు. దీనిపై బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీ ఘటన తన దృష్టికి వచ్చిందని, విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.రాజేశ్‌కుమార్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

టేకులపల్లి: బాలికపై లైంగికదాడికి యత్నించిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. శుక్రవారం రాత్రి టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు (30) ఇంటి ఎదుట ఉంటున్న బాలిక పట్ల పలుమార్లు అసభ్యంగా ప్రవర్తించాడు. లైంగికదాడికి యత్నించాడు. ఈ విషయంలో యువకుడికి దేహశుద్ధి కూడా చేసినట్లు సమాచారం. అయినా యువకుడిలో మార్పు రాకుండా గ్రామంలో వెకిలి చేష్టలు చేస్తూ అందరినీ ఇబ్బందులకు గురి చేస్తుండే వాడు. ఈ నేపథ్యంలోనే బాలిక కుటుంబ సభ్యులు శుక్రవారం టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లక్ష్మీదేవిపల్లిలో చోరీ

పాల్వంచరూరల్: పట్టపగలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు చెప్పిన వివరాలు.. లక్ష్మీదేవిపల్లిలోని 7వ వీధిలో నివాసం ఉంటున్న భూక్యా సరోజిని ఇంటికి తాళం వేసి శుక్రవారం పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్‌కు వెళ్లి వచ్చింది. ఇంటి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.50వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించింది. దీంతో లబోదిబోమంటూ చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. ఇంకా ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

రండీ.. పారిశ్రామిక వేత్తలుగా ఎదగండి



ఎక్స్‌పోలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రభుత్వ సబ్సిడీ
- వ్యక్తిగతంగా, గ్రూప్‌గా ఏర్పాటు చేసుకున్నా వర్తింపు
- ఫుడ్ ప్రాసెసింగ్ ఎక్స్‌పోలో ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్



యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న ఔత్సాహికులు

ఖమ్మంఅర్బన్: ఔత్సాహికులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో అందుబాటులోకి వచ్చిన అధునాతన యంత్రాలపై సబ్సిడీ కూడా లభిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి పథకం – తయారీ సంస్థల క్రమబద్ధీకరణ కింద జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ ఎక్స్‌పోను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల క్రింద తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. ఔత్సాహికులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని పరిశ్రమలను ఏర్పాటుచేస్తే మరికొందరికి ఉపాధి కల్పించొచ్చని చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో కూడిన రుణాన్ని మంజూరు చేస్తుందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు డ్రోన్లు, హార్వెస్టర్ తీసుకొని అద్దెకు ఇస్తూ ఆదాయం పొందొచ్చని తెలిపారు. ఇంకా ఇళ్లలోనూ ఏర్పాటుచేసుకోగలిగితే మినీ రైస్ మిల్, దాల్ మిల్, కారంపొడి తయారీ తదితర యూనిట్లు ఉన్నాయని చెప్పారు. పది శాతం లబ్ధిదారుల వాటా, 35 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణంతో పరిశ్రమ స్థాపించుకోవచ్చని, వ్యక్తిగతంగా రూ.16లక్షల వరకు, గ్రూపుగా రూ.4 కోట్ల వరకు రుణాలు లభిస్తాయని వివరించారు. ఖమ్మంలో చైనాకు చెందిన కంపెనీ కారం పొడి ఫ్యాక్టరీని ఏర్పాటుచేసినప్పుడు స్థానికులు ఎందుకు ఏర్పాటుచేయలేరని ప్రశ్నించారు. అనంతరం వివిధ యంత్రాల తయారీదారులు, అధికారులు ఎక్స్‌పోకు వచ్చిన వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిశ్రమల శాఖ జీఎంలు అజయ్‌కుమార్, సీతారాం, ఖమ్మం డీఆర్‌డీఓ విద్యాచందన, భద్రాద్రి కొత్తగూడెం ఎల్‌డీఎం రాంరెడ్డి, రాష్ట్ర ఫుడ్ ప్రాసెస్సింగ్ సొసైటీ ప్రతినిధి సంజీవ్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తిగా ఆరా తీస్తూ...

ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటుచేసిన ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు హాజరై ఇక్కడి యంత్రాలను పరిశీలించారు. వీటి పనితీరు, ధర, లాభాలు, నిర్వహణపై కంపెనీల బాధ్యులతో చర్చించారు. ఈసందర్భంగా ఎక్స్‌పోలో గంటకు 30నుంచి 50కేజీల ఎల్లిపాయలు వలిచి ముక్కలు చేసే యంత్రంధర రూ.2లక్షల నుండి రూ.3 లక్షల వరకు), చేతులతో చేసే పని లేకుండా గంటకు 30కేజీల వరకు పిండివంటలు తయారు చేసే యంత్రం(ధర రూ.2లక్షలు), ఇంట్లోనే గంటకు ఐదు కేజీల వరకు పల్లి, నువ్వుల నూనె తీయగలిగే యంత్రం(ధర రూ.15 వేల నుండి రూ.10 లక్షల వరకు)ను పలువురు ఆసక్తిగా పరిశీలించారు.



పిండి వంటల తయారీ యంత్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఇంట్లోనే యూనిట్ ఏర్పాటు చేయాలని..



రూ.2లక్షలలోపు యూనిట్‌ను ఇంట్లోనే ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలనేది ఆలోచన. ఈ ఎక్స్‌పోలో అనేక రకాల యంత్రాలను అందుబాటులో ఉంచారు. ఆయా కంపెనీలో మాట్లాడి వివరాలు తెలుసుకున్నాను. అధికారులతో మాట్లాడాక ఏ యూనిట్ ఏర్పాటుచేయాలనేది నిర్ణయించుకుంటా.

– ఎం.స్టాలిన్ తమ్మినేనిపాలెం, చింతకాని

పిండి వంటల తయారీ కోసం..



ఇప్పటి వరకు ఇంట్లోనే వివిధ రకాల పిండి వంటలు తయారుచేసి అమ్ముతూ ఉపాధి పొందుతున్నాను. కానీ కష్టం తగ్గించుకుని, ఎక్కువ ఉత్పత్తి చేయాలంటూ యంత్రాలు అవసరమని తెలిసింది. అందుకే ఇక్కడ యంత్రం ద్వారా పిండి వంటల తయారచేయగలిగే యంత్రం వివరాలు తెలుసుకున్నా.

– కవిత, కొత్తగూడెం

వివాహిత ఆత్మహత్య



వాణి (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చంద్రుగొండ మండలం సీతాయిగూడెం గ్రామానికి చెందిన చిన్నం వాణి (28) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వాణిని భర్త నాగసురేశ్ 11వ తేదీన మండలంలోని అబ్బుగూడెం గ్రామంలో ఉంటున్న ఆమె తల్లిదండ్రుల వద్ద వదిలి వెళ్లాడు. తెల్లవారుజామున తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో వాణి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి అచ్చన సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షాహిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ట, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళలపై లైంగిక వేధిపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్‌సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌చైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? అల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..



అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్



నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. -భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సయ్యద్ దానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యుల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా

నగర మాడ్యుల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

ఈ కేసులో సాక్షులుగా 'వారు'

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్–2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది. ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాదిరాన సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

నిర్వహించనున్న క్రీడలు.. : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

నగదు ప్రోత్సాహకాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ–రూ.20 వేలు, ద్వితీయ–రూ.15 వేలు, తృతీయ–రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొండికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టచెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

జిల్లా వార్తలు


ప్రపంచ షూటింగ్ టోర్నీలకు మేఘన




సాధుల మేఘన

ఖమ్మంస్పోర్ట్స్: ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఖమ్మానికి చెందిన సాధుల మేఘన అర్హత సాధించింది. జర్మనీ, కొరియా దేశాల్లో జరగనున్న జూనియర్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగం పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి వరకు, కేంద్రీయ విద్యాలయ సమితిలో ఇంటర్ పూర్తిచేసిన మేఘన, ఇప్పటికే రెండు సార్లు ఆర్చరీ జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో శిక్షణ పొందుతోంది. ఖమ్మంలో సీఐగా విధులు నిర్వర్తించిన తండ్రి సాధుల సారంగపాణి, ఆర్చరీ అసోసియేషన్ బాధ్యుడు పుట్టా శంకరయ్య వద్ద శిక్షణ తీసుకుని ప్రతిభ చాటుతున్న ఆమెను పలువురు అభినందించారు.

సత్తా చాటిన 'నవోదయ' విద్యార్థులు



నిఖిల్



జ్యోషిక

కూసుమంచి: సీబీఎస్‌ఈ పదో తరగతి, 12వ తరగతి (ప్లస్–2) ఫలితాలు శుక్రవారం విడుదల కాగా పాలేరులోని జవహర్ నవోదయ విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతిలో విద్యాలయ నుంచి 75 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో కె.నిఖిల్, జి.జ్యోషిక 96.2 శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఇక 12వ తరగతి పరీక్షలకు 73 మంది విద్యార్థులు హాజరుకాగా 72 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో ధరణి 88 శాతం , యశోధర 79 శాతం మార్కులతో టాపర్లుగా నిలవగా విద్యార్థులను ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

త్వరలో భద్రాద్రి జిల్లాకు గవర్నర్?

భద్రాచలం: రాష్ట్ర గవర్నర్ తమిళిసై త్వరలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చే అవకాశముందని సమాచారం. ఈనెల 11న గవర్నర్ భద్రాచలం వస్తారని కొద్దిరోజుల కిందట అధికారులు వెల్లడించినా ఆ తర్వాత వాయిదా పడింది. కాగా, ఈ నెల 14 లేదా 17వ తేదీన గవర్నర్ పాల్వంచ, భద్రాచలం పర్యటనకు వస్తున్నారని తెలిసింది. అయితే, ఈ విషయాన్ని జిల్లా అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

అటు నష్టం.. ఇటు భారం

- అకాల వర్షంతో దెబ్బతిన్న కూరగాయల పంటలు
- పలుచోట్ల పంటలు వదిలేసిన రైతులు
- ఫలితంగా మార్కెట్‌లో కొరత, పెరిగిన ధర



ఖమ్మం రూరల్ మండలం వెంకటాయపాలెంలో వదిలేసిన వంగ తోట



ఖమ్మం మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు

రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలోకు రూ.ల్లో)

కూరగాయలు	ధర
టమాటా	24
వంకాయ	20
బెండకాయ	26
పచ్చిమిర్చి	50
కాకరకాయ	40
బీరకాయ	50
దొండకాయ	30
నాటు దోస	26
పొట్లకాయ	40
గోరుచిక్కుడు	50
క్యాప్సికం	50
క్యారెట్	36

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాలు అన్ని రకాల పంటలను ఆగమాగం చేశాయి. ఈదురుగాలులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలతో చేతికందే పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. సాధారణంగా మే, జూన్ నెలల్లో ఈదురుగాలులు, అకాల వర్షాలు కురుస్తుంటాయి. కానీ ఈసారి మార్చి, ఏప్రిల్‌లోనూ ఈ పరిస్థితి నెలకొనడంతో వాణిజ్య పంటలకు తోడు కూరగాయలు, ఆకుకూరల పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరల పంటల సాగు ఉండగా.. అత్యధిక శాతం పంటలు దెబ్బతిన్న కారణంగా మార్కెట్‌లో కూరగాయల కొరత ఏర్పడింది.

వేసవి పంటలు వర్షార్పణం

యాసంగి సీజన్‌లో సాగు చేసిన దాదాపు అన్ని పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలో కూరగాయలు, ఆకుకూరల పంటల సాగు ఎక్కువగా ఉంటుంది. ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, కామేపల్లి, కొణిజర్ల, బోనకల్, చింతకాని, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఏన్కూరు తదితర మండలాలే కాక భద్రాద్రి జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు, కొత్తగూడెం, పాల్వంచ, టేకులపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట తదితర మండలాల్లో కూరగాయల సాగు విస్తీరం ఎక్కువగా ఉంది. ఆయా మండలాల నుంచి విజయవాడ, గుంటూరు, రాజమండ్రికి కూడా కూరగాయలు ఎగుమతి చేస్తారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో చేతికొచ్చేలా రైతులు కూరగాయలు సాగు చేస్తుండగా.. అంతా బాగుందనుకున్న తరుణాన ప్రకృతి కాటేసింది. పందిర్లు, నేలపైన సాగు చేసిన పంటలను ఈదురుగాలులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు దెబ్బతీశాయి.

ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం

అన్నీ అనుకూలిస్తే ఎకరా కూరగాయల సాగుతో రైతులకు రూ.లక్ష వరకు ఆదాయం ఉంటుంది. కానీ వర్షాల కారణంగా పెట్టుబడి కూడా దక్కలేదు. ఉద్యానశాఖ లెక్కల ప్రకారం టమాటా, బెండ, వంగ, కాకర కూరగాయల పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండగా.. అకాల వర్షాలు, వడగళ్ల వానతో దెబ్బతిన్నాయి. ప్రధాన టమాటా పంట దెబ్బతినగా.. మిగిలిన పంట నాణ్యత లేకపోవడంతో అమ్మడానికి వీలవడం లేదు. ఫలితంగా చాలా చోట్ల రైతులు పంటలను చేన్లలోనే వదిలేశారు. దీంతో కర్ణాటక రాష్ట్రంలో పందిర్లపై సాగు చేసే టమాటాను, బీర, కాకర, మునగను తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తెప్పించి అమ్ముతున్నారు. ఈ కారణంగా మార్కెట్లలో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో కిలో రూ.10 నుంచి రూ.20 ఉండే టమాట, బెండ, బీర, వంగ, కాకర వంటి కూరగాయల ధర ప్రస్తుతం రూ.20 నుంచి రూ.50 వరకు పలుకుతోంది.

కూరగాయల పంటలు తొలగించాం



అకాల వర్షాలతో పది ఎకరాలకు పైగా టమాట, బెండ, దొండ, వంగ పంట దెబ్బతినడంతో తొలగించాం. వర్షంతో టమాట పంట పూర్తిగా నాణ్యత కోల్పోయింది. పంటలు చేతికందే సమయంలో కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

– చెరుకూరి రామారావు, రైతు, కోయచెలక

పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి



తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల పంటలు దెబ్బతినగా.. మిగిలిన చోట నాణ్యత లేదు. దీంతో కర్ణాటక నుంచి టమాటా, బీర, వంగ, కాకరను తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇంకొన్ని రోజులైతే టమాటా ఆశించిన మేర దొరకకపోవచ్చు.

–తోట రామారావు, కూరగాయల వ్యాపారి, ఖమ్మం

నాణ్యత లేవు.. ధరలు పెరిగాయి



కొద్ది రోజులుగా ఏ మార్కెట్‌కు వెళ్లినా కూరగాయలు నాణ్యతగా ఉండడం లేదు. దీనికి తోడు దాదాపు అన్ని కూరగాయల ధరలు పెరిగాయి. అకాల వర్షాలతో ఈ పరిస్థితి నెలకొందని విక్రయదారులు చెబుతున్నారు. నాటు టమాటా అసలు మార్కెట్‌లోనే లభించడం లేదు.

– గాజుల భారతి శ్రీనివాస్, ఖమ్మం

గోదావరి పరవళ్లు!



వేసవికాలం.. మే నెలలో ప్రాజెక్టులు, వాగులు, వంకలు నీరు అడుగంటడం సహజం. కానీ అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం సమీపాన దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద మాత్రం గోదావరి పరవళ్లు తొక్కుతోంది. మేడిగడ్డ నుంచి రెండు రోజుల కిందట దిగువకు నీరు వదిలారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి గోదావరిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతూ ఆనకట్ట పైనుంచి జారుతున్న నీటితో జలపాతంలా కనివిందు చేస్తోంది. – అశ్వాపురం

పనుల్లో వేగం పెంచండి

- వర్షాలు పడితే గ్రామాల్లో ఇబ్బందులు రావొద్దు
- ఇంజనీరింగ్ అధికారులకు పీఓ గౌతమ్ ఆదేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీఓ గౌతమ్

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని ఏజెన్సీ గ్రామాల్లో చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని, త్వరితగతిన పూర్తి చేయాలని పీఓ గౌతమ్ పోట్రు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం రానున్న నేపథ్యంలో గిరిజనులు ఇబ్బంది పడకుండా పనులను సకాలంలో చేయాలని సూచించారు. 121 గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 178. 49 కోట్లు మంజూరయ్యాయని, వర్షాకాలం రాకముందే రోడ్లు నిర్మించాలని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం కింద చేపట్టబోయే పనులకు వెంటనే టెండర్లు పిలవాలన్నారు. ఈ పనులకు రూ. 28.50 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. గిరిజన గ్రామాలలో సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రసూతి వార్డులు తదితర భవన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. వైరాలో నిర్మిస్తున్న గిరిజన భవనాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. 199 గిరిజన గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయని, స్థానిక సర్పంచ్‌లతో కలిసి అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలని సూచించారు. ఆరు గురుకుల పాఠశాలల్లో అదనపు గదులు, ఇతర సౌకర్యాల కోసం రూ. 5 కోట్లు మంజూరయ్యాయని, ఆ పాఠశాలల లేఔట్‌లు, రిపేర్లకు ప్రతిపాదనలు తనకు సమర్పించాలని తెలిపారు. పనుల్లో అశ్రద్ధ చేసినా, నాసిరకంగా నిర్మాణాలు చేపట్టినా కాంట్రాక్టర్లతో పాటు అధికారులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, డీఈలు రాములు, రామిరెడ్డి, ఏఈలు రాజు ,హరీష్ పాల్గొన్నారు.

గ్రంథాలయ పరిషత్ ప్రారంభోత్సవంలో చైర్మన్లు




మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉమామహేశ్వరరావు, రాజేందర్

ఖమ్మంగాంధీచౌక్/ఇల్లెందు: హైదరాబాద్‌లో శుక్రవారం గ్రంథాలయ పరిషత్ కార్యాలయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లతో సమావేశమై లైబ్రరీల పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లు కొత్తూరు ఉమామహేశ్వర రావు, దిండిగాల రాజేందర్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు మూలం విద్యలోనే ఉంది..

ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ బుర్రా రమేశ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రమేశ్

ఖమ్మంసహకారనగర్: మనిషిలో ఉన్న వ్యక్తివాదాన్ని విద్య తట్టిలేపుతుందని.. తద్వారా సమాజంలో సమష్టివాదానికి బదులు వ్యక్తివాదం ముందుకొస్తూ ప్రైవేటీకరణకు విద్య సాధనంగా మారిందని భోపాల్ ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ బుర్రా రమేశ్ అభిప్రాయపడ్డారు. ఖమ్మం జెడ్పీహాల్‌లో టీపీటీఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం 'విద్య ప్రైవేటీకరణ – ప్రైవేటీకరణలో విద్య'అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచీకరణ తర్వాత విద్యలో వ్యక్తివాదాన్ని ముందుకు తీసుకొచ్చి అదే నిజమైందని చెబుతున్నారని పేర్కొన్నారు. మానవ, శాస్త్ర సాంకేతిక పరిశోధనలతో సృష్టించబడిన ఉపకరణాలు మనుషులు సమష్టిగా చేసే పనిని వ్యక్తిగా చేయటానికి దోహదపడుతున్నాయని.. మనిషికి స్వేచ్ఛను ఇచ్చి సమాజం నుంచి దూరం చేస్తున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వ్యక్తికి, సమాజానికి మధ్య వచ్చే సంఘర్షణలో సమాజం వైపు నిలబడేలా తరగతి గదిని మార్చాలని కోరారు. ఈ సదస్సుకు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ అధ్యక్షత వహించగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులుతో పాటు మనోహర్ రాజు, రామారావు, ఎస్.వెంకటేశ్వర్‌రావు, నర్సింహారావు, ప్రసాద్‌రావు, వెంగళరావు, ఏవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.